క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

పుల్లంపేట : మండల కప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరుగనున్నట్టు ఎంపీడీఓ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

27న చిట్వేలిలో 'జగనన్నకు చెబుదాం'

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 27న ఉదయం 9.30 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ శివరామిరెడ్డి బుధవారం తెలియజేశారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జిల్లా, మండలస్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

రేపు ఆలయ చెట్ల వేలం

చిన్నమండెం : మండల పరిధిలోని జల్లావాండ్లపల్లెలో వెలసిన శ్రీ మండెం లక్ష్మీనరసింహాస్వామి బాలాలయ ప్రతిష్ట, భూమిపూజ జరిగి దేవస్థానం ఆవరణలో, కోనేరు వద్ద ఉన్న చెట్లను ఈ నెల 27న ఆలయ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ధరావత్తు కింద రూ.10 వేలు చెల్లించాలని తెలిపారు. వేప చెట్లు – 17, చింతచెట్లు – 3, కానుగచెట్లు – 3 వేలం వేయబడునని తెలిపారు. వేలం దక్కించుకున్నవారు చెట్లను వెంటనే తొలగించవలెనన్నారు. ఇతర షరతులు వేలానికి ముందుగా తెలపబడునని ఆలయ ఈఓ. కొండారెడ్డి తెలియజేశారు.

ఘనంగా అసారే షరీఫ్ వేడుకలు


అసారే షరీఫ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు (రాజంపేట) : మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మౌలానా మౌల్వీ సయ్యద్ మైనుద్దీన్ హుస్సేని గురువులయ్య గవర్నమెంట్ గెజిటెడ్ ఖాజీ ఆధ్వర్యంలో ఘనంగా అసారే షరీఫ్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం మండలంలోని ముస్లిం పెద్దలు, ముస్లింలు ఈ వేడుకలలో పాల్గొని భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో గురువులయ్య సోదరులు సాహెబ్ హైదర్, అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, ముస్లిం పెద్దలు సయ్యద్ జుల్ఫికర్, నూర్‌మహ్మద్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం తరహాలో మల్లయ్యకొండ అభివృద్ధి

తంబళ్లపల్లె : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ ఆలయాన్ని శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆంజనేయస్వామి, వినాయక గుడి, వెలుగు మల్లమ్మ ఆలయం, గౌరీదేవి వేదపండితులు లక్ష్మన్న, అమరా, బాలాజీ, గోవర్ధన్, మురళి, రాజేష్‌లు సంప్రదాయబద్ధంగా అగ్నిహోమాలు నిర్వహించి బాలాలయం కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌరీదేవి ఆలయం వద్ద హోమం కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారనాథరెడ్డి, పూజారి శేఖర్, విజయనిర్మల దంపతులు హోమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రధాన మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాల పునఃనిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణలు తెలిపారు.

కార్గో ఆదాయం పెంచాలి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ కార్గో ఆదాయం పెంచాలని ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి కార్గో మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి నాలుగు డోర్ డెలివరీలు బుక్ చేయాలన్నారు. సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 4న కడపలో సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మోదీప్రభుత్వం అనుసరిస్తున్న రైతు,కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబరు 4న జిల్లా సదస్సు జరగనుంది. దీనిని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయు జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా నవంబర్ 26, 27, 28 తేదీలలో విజయవాడ రాజభవన్ వద్ద జరిగే మహాధర్నాలను జయప్రదం చేయాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు పంటలకు సమగ్ర ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50% కలిపి చట్టబద్ధ మద్దతు ధరలు ప్రకటించాలన్నారు. కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెంచి పంట రుణాలు అందించాలని,కేరళలో తరహాలో రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటులో చేయాలన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

- ప్రతి పేదవాడికి ధైర్యం కల్పించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష
- అందరి సంక్షేమం కాంక్షించే పార్టీ వైఎస్సార్‌సీపీ
- జనాలతో కిక్కిరిస్తున్న వైద్య శిబిరాలు


రాయచోటి అర్బన్: మందులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు


గాలివీడు: మాట్లాడుతున్న యదుభూషన్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్‌లు వైద్య సిబ్బందిని కోరారు. పట్టణంలోని కొత్తపేట రామాపురం అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును వారు పరిశీలించారు. రోగుల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బందితో మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ధైర్యం కల్పించేందుకే ఈ కార్యక్రమం తీసుకొచ్చామన్నారు. చికిత్సకు వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య సదుపాయం అందించాలన్నారు. ఆరోగ్య శిబిరానికి విచ్చేసిన ప్రజలకు అవసరమైన అన్నిరకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వసీమ్ అక్రమ్, జ్యోతి, పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, టీపీఓ లక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునతో పాటు అర్బన్ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


పెనగలూరు: మందులను అందజేస్తున్న వైద్య బృందం

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

పెనగలూరు : జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఒక వరంలాంటిదని జెడ్పీటీసీ సుబ్బరాయుడు అన్నారు. బుధవారం కొండూరు–2 సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ రామాంజులమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అధికారులతోపాటు జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఇంటివద్దకే వైద్య సేవలు అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. నిత్యం ప్రజలుకోసం ఆలోచించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. అంతకుముందు తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్‌లు పలు అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం అధికారులు అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. డాక్టర్ తౌషీఫ్ ఆధ్వర్యంలో వైద్య బృందం 426 మందికి ఓపీలు చూసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ శ్రీధర్ రావు, ఏఓ పద్మభూషన్ రెడ్డి, వైద్య బృందం, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, స్థానిక నాయకులు లక్ష్మీపతి రెడ్డి, నెల్లూరు బుజ్జిరెడ్డి, జనార్దన్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న సురక్ష

గాలివీడు : గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమమే జగనన్న సురక్ష అని వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి అన్నారు. మండలంలోని అరవీడు గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అందరి సంక్షేమం కాంక్షించే పార్టీ వైఎస్సార్‌సీపీ అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి పేదవాడికి ఆరోగ్య రక్షగా ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రజా సంక్షేమాన్ని కోరుకునే వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. వైస్ ఎంపీపీ – 2 గాలి శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ శేఖర్ నాయక్, అధికారులు, సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజల ఆరోగ్యానికి రక్ష లాంటిదని ఎంపీడీఓ హైదర్‌అలీ ప్రభుత్వ వైద్యాధికారి డా.విజయ్‌కుమార్‌లు అన్నారు. మండలంలోని సుద్దమళ్ల పంచాయతీలోని బయారెడ్డిగారిపల్లెలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే ప్రకారం గుర్తించిన రోగులకు ప్రముఖ వైద్యుల ద్వారా చికిత్సలు చేయించడం జరుగుతుందన్నారు. ఇంకా దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న రోగులకు ఇతర ఆసుపత్రులలో శస్త్ర చికిత్సలు ప్రభుత్వం చేయిస్తుందని వారు తెలిపారు. ఈఓపీఆర్‌డీ ఉషారాణి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ ఆంజనేయరెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట బార్ అసోసియేషన్ ఏర్పాటు


సురేంద్రబాబు, అధ్యక్షుడు, బార్ అసోసియేషన్

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ ఏర్పాటు చేస్తూ బుధవారం బార్ కార్యాలయం నుంచి కార్యవర్గ జాబితా విడుదలైంది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.సురేంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా టి.గోపాల్‌రెడ్డి, కోశాధికారిగా వీవీ రమణలు ఎన్నికయ్యారు. స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా మహబూబ్‌బాషా నియమితులయ్యారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ

రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సురేంద్రబాబు ఆధ్వర్యంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2 విలువ చేసే వెల్ఫేర్ స్టాంప్‌ను రూ. 20 చేసినందుకు నిరసనగా రాజంపేట బార్ అసోసియేషన్ విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు. గతంలో కోర్టు పిటిషన్‌కు రూ.2 వేస్తే తీసుకునేవారన్నారు. ఇప్పుడు రూ20 స్టాంప్ వేయాల్సి వస్తోందన్నారు. దీనిని న్యాయవాదులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

మహిళలపై దౌర్జన్యాలను అరికట్టాలి

కడప కల్చరల్ : విలువలు తరిగిపోతున్న నేటి సమాజంలో మహిళలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టాలని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌ను కోరారు. బుధవారం ఆయన గుంటూరు రేంజ్ ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ డాక్టర్ భువనగిరి కృష్ణవేణితో కలిసి ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఏపీఎండీసీ ఎండీ హామీతో ఆందోళన వాయిదా


ఆందోళన వాయిదా వేస్తున్నట్టు సీపీఓ సుదర్శన్ రెడ్డికి తెలుపుతున్న కార్మిక నాయకులు

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ సంస్థలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాట కమిటీ జేఏసీ నాయకులు ఈనెల 26వ తేదీ నుంచి చేపట్టనున్న దశలవారీ ఆందోళన ఏపీఎండీసీ ఎండీ హామీతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పోరాట కమిటీ జేఏసీ సభ్యులు బుధవారం సీపీఓ సుదర్శన్ రెడ్డికి లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఏపీఎండీసీ కార్యాలయానికి ఎండీ వీజీ వెంకటరెడ్డి విచ్చేయడంతో కార్మికుల తమ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. త్వరలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ ఆర్.వెంకటేష్, వర్కింగ్ యూనియన్ జనరల్ సెక్రటరీ బండారు భాస్కర్, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ నారదాసు సుబ్బరాయుడు, పోరాట కమిటీ ట్రెజరర్ ఈశ్వరయ్య, పోరాట కమిటీ జేఏసీ కో–కన్వీనర్ అరుణావతి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయండి

వాల్మీకిపురం: ఈ నెల 31న స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొంటున్నాయని, 18 సంవత్సరాలు పైబడి, 28 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. అభ్యర్థులు ముందుగా వలంటీర్ల వద్ద తమ పేర్లను నమోదు చేసుకొని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో విద్యార్హత జిరాక్స్ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫోటోలు తెచ్చుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ అధికారులు పరిష్కరించాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు కోరారు. ఈనెల 17న విజయవాడలో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బందికి న్యాయపరంగా రావాల్సిన వాటిని ఇప్పించేందుకు ఆర్‌జేడీలు, డీఈఓలు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలను ఇచ్చారన్నారు. వాటిని జిల్లాలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో ప్రైవేట్ ఉపాధ్యాయులకు బ్యాంకు ఖాతాల ద్వారా జీతం ఇవ్వాలని, ఆరోగ్య బీమా చెల్లించాలని కోరారు.

'నవోదయ'లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా జవహర్ నవోదయ ప్రిన్సిపల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తరగతిలో చేరేందుకు ప్రస్తుతం ప్రభుత్వ, ప్రభుత్వం గుర్తింపు పొందిన విద్యార్థులు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. వీరు 01.05.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. అలాగే 11వ తరగతిలో (ఇంటర్‌లో) 2024 – 2025 విద్యా సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు ప్రభుత్వ, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. 01.06.2007 నుంచి 31.09.2009తేదీల మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 31వ తేది లోగా చేసుకోవాలని తెలియజేశారు.

రాజంపేట : జవహర్ నవోదయ విద్యాలయ (నారంరాజుపల్లె, రాజంపేట)లో 2024 – 2025 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతులలో ఏర్పడిన ఖాళీల భర్తీకి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ ఎం.గీత బుధవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వం చే గుర్తింపుబడిన పాఠశాలల్లో ఉభయ జిల్లాలో 2023 – 2024 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, అలాగే 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశపరీక్ష 10.02.2024లో నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఎన్‌వీవోడీఎవైఏ.జీఓవీ.ఇన్‌ను సంప్రందించాలన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి


లక్కిరెడ్డిపల్లె: ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ వరప్రసాద్


రాజంపేట: నందలూరులో ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్‌ఐలు

నందలూరు (రాజంపేట) : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఏఎస్‌ఐలు శంకర్ నాయక్, రాముడులు సూచించారు. బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనదారులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోతే కలిగే నష్టాలను వివరించారు. వాహనదారులు వాహన ధృవీకరణ పత్రాలు ఉంచుకోవాలని, డ్రైవింగ్ లైసెన్సు లేని వారు, మైనర్ పిల్లలు వాహనాలు నడపకూడదని, అలాగే ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్‌ను తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు శ్రీనివాసులు, మహేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల నుంచి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్ తెలియజేశారు. బుధవారం మండలంలోని వేంపల్లి – రాయచోటి మార్గంలోని కోర్టు వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వాడకూడదన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చనన్నారు. కావున ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం నిత్యం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు నగదు ప్రోత్సాహకాలు


డ్రైవర్‌కు చెక్కును అందజేస్తున్న డీఎం రమణయ్య

రాజంపేట : డీజిల్ పొదుపు డ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజరు గుండాల రమణయ్య అన్నారు. బుధవారం స్థానిక డిపో గ్యారేజీలో ఆదర్శ ఉద్యోగుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజిల్ పొదుపు చేయడం వల్ల ఆర్టీసీకి పరోక్షంగా మేలు చేసినవారమవుతామన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు సమన్వయంతో పనిచేస్తే కచ్చితంగా ఆర్టీసీ లాభాల బాటలో ముందుకెళుతుందన్నారు. కేఎంపీఎల్ సాధించిన ఎం.ఫిరోజ్, బి.పరుశురామ్, ఈపీకే సాధించిన కండక్టర్ భాస్కర్‌లను నగదు అవార్డులతో సత్కరించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని మరికొందరు డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వర్తించి, ఆదర్శ ఉద్యోగులగా నిలవాలని డీఎం పిలుపునిచ్చారు.

సంబరంగా వాసవీమాత వసంతోత్సవం


ఓబులవారిపల్లె: గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు


చిట్వేలి: శయ్యా అలంకారంలో కన్యకాంబ


నందలూరులో ఊంజల్ సేవలో వాసవీ మాత

రాజంపేట టౌన్ : ఈనెల 15వ తేదీ నుంచి అమ్మవారిశాలలో జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వసంతోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరిని రథంలో కొలువుదీర్చి అమ్మవారిశాల నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా కొత్తబస్టాండు, పాత బస్టాండు మీదుగా జమ్మిచెట్టు వరకు ఊరేగించారు. అమ్మవారి ఊరేగింపు ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో సాగింది. ఇదిలావుంటే మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రారంభమైన అమ్మవారి శమీదర్శన ఊరేగింపు బుధవారం ఉదయం 7 గంటల వరకు సాగింది. శమీదర్శనం సందర్భంగా పాతబస్టాండు సర్కిల్‌లో బాణాసంచాలు పేలుళ్లను తిలకించేందుకు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. కాగా బుధవారం రాత్రి వాసవీమాత ఊంజలిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంతో ఉత్సవాలకు ముగింపు పలికారు.

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లె గ్రామం సాయినగర్‌లో భద్రాది భావనారాయణ స్వామి ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవి విగ్రహాన్ని బుధవారం భక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో అమ్మవారు రథం నివాస గృహాల గుమ్మము వద్దకు రాగానే గృహిణులు అమ్మవారికి కాయాకర్పూరాలను, సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి గ్రామోత్సవం ముందర స్థానిక మహిళా కళాకారులు నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో విజయదశమి సందర్భంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించిన వేడుకలు బుధవారం ఊంజల్ సేవతో ముగిశాయి. అంతకుముందు అమ్మవారిని గ్రామ పురవీధులలో పెద్దఎత్తున బాణాసంచా పేల్చుతూ ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు, గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిట్వేలి : మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం ఉదయం పూజాదికార్యక్రమాల అనంతరం ఆనందోత్సాల మధ్య వసంతోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి శయ్యా అలంకారం, ఊంజల్ సేవా కార్యక్రమాలు జరిపారు. ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘన, వాసవీ యూత్ సంఘం, ఆర్యవైశ్య సమారాధన కమిటీ, వాసవీ మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా చేశారు.

నందలూరు (రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరిరోజు ఊంజల్ సేవ (పాన్పుసేవ) వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహ శెట్టి, సెక్రటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు ఎంబలూరు నరసింహ ప్రసాద్, మంచికంటి నారాయణ, మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు గెలివి జయలక్ష్మీ, చలపాటి మాధవి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.


సిద్దవటం: అమ్మవారి విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


రాజంపేట టౌన్: వాసవీమాతను ఊరేగిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారిద్దాం

ప్రజలకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి విజ్ఞప్తి



రాయచోటి : ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి కోరారు. బైక్ ప్రమాదాలలో ఎక్కువ మంది మృతిచెందుతుండటంపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. హెల్మెట్ లేకపోవడం కారణంగా ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి బుధవారం సాయంత్రం పత్రికలకు అందజేసిన ప్రకటనలో ఆవేదనను వెలిబుచ్చారు. ప్రమాదాల కారణంగా అనేక కుటుంబాలు అనాథలుగా మిగిలి పోతున్నాయన్నారు. సామాన్యుడి నుంచి ఉద్యోగస్తుల వరకు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇటీవలే రాయచోటి పట్టణంలో పోలీస్ కానిస్టేబుల్‌లు కూడా చనిపోవడం బాధాకరమన్నారు. బైక్ నడిపేవాళ్లు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఇచ్చిన ఆదేశాలు, సూచనల మేరకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధారణతో చాలా వరకు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తూ, వేగంగా పోకుండా డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు బైకులు ఇవ్వకుండా, పోలీస్ అధికారులకు సహకరించాలన్నారు. ప్రాణం విలువ ఉన్నప్పుడు తెలియదని, ఎంతో మంది తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారని బాధను వ్యక్తం చేశారు. మొదట్లో కొంత కష్టం అనిపిస్తుంది కానీ, రూల్స్ అన్నీ ఫాలో అవ్వడం చాలా అవసరమన్నారు. మన కోసం, మన కుటుంబసభ్యుల కోసం హెల్మెట్ ధరించి ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలన్నారు. ఒకటే రోజున రాయచోటి మార్చురీలో మూడు నాలుగు బైక్ ప్రమాదాలలో శవాలను చూడాల్సిన పరిస్థితి ఏర్పడడం బాధాకరమైన విషయమన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని శ్రీకాంత్‌రెడ్డి కోరారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

వాల్మీకిపురం : పట్టణంలోని కొత్తపేటవీధిలో విలువైన మూడున్నర సెంట్ల ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ ప్రాథమిక స్పెషల్ పాఠశాల భవనాలతో పాటు మరుగుదొడ్లు నిర్మించారు. అయితే గత కొంత కాలంగా ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వం నిర్మించిన మరుగు దొడ్లే స్థలం తమదే నంటూ కోర్టును ఆశ్రయించారు. ఇది ఇలా ఉండగా, దసరా సెలవుల నిమిత్తం పది రోజుల పాటు పాఠశాల మూతపడింది. ఈ నేపథ్యంలో బుధవారం పునఃప్రారంభమైంది. బుధవారం యథావిధిగా విధులకు హాజరైన పాఠశాల హెచ్ఎం పద్మావతి పాఠశాల ఆవరణంలోని ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లను కూల్చివేసిన విషయాన్ని గమనించింది. అయితే విద్యాధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా, వారికి విషయం తెలపకుండా సెలవుల్లో ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లను కూల్చేసిన విషయాన్ని హెచ్ఎం మండల విద్యాధికారి వెంకటరత్నం దృష్టికి తీసుకెళ్లింది. జరిగిన ఘటనపై ఎంఈవో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారితో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినందుకే తాము మరుగుదొడ్లను కూల్చేశామని ప్రైవేటు వ్యక్తులు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్‌ను వివరణ కోరగా పాఠశాల, మరుగుదొడ్లు నిర్మించిన స్థలం పంచాయతీ, విద్యాశాఖకు సంబంధించిన విషయమని, ఇది తమ పరిధిలో లేదని, సర్వే చేయమని ఫిర్యాదు చేస్తే సర్వే చేసి కొలతలు చూపుతామని సమాధానం చెప్పారు.